సాక్షి ఆదిలాబాద్

సోమవారం ၊ 25 ၊ సెప్టెంబర్ ၊ 2023



'మథుర' సంస్కృతి.. విభిన్నం

ఉమ్మడి జిల్లాలో ఉన్న తెగల్లో ఒకటి మథుర లబానా. ఉత్తర భారతం నుంచి వలస వచ్చిన వీరి సంస్కృతి భిన్నమైంది. ఆచార సంప్రదాయాలు ప్రత్యేకం. 8లో▸



ఘనంగా గణేశ్ నిమజ్జనం

జిల్లాలో పలుచోట్ల గణేశ్ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తుల పూజలందుకున్న గణనాథుడిని ఆదివారం గంగమ్మ ఒడికి చేర్చారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి డీఈడ్ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: డీఎడ్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల నం.2, జెడ్పీఎస్ఎస్ ఉట్నూర్ తెలుగు మీడియంలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయని, విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు.

కాంగ్రెస్ అనుబంధ సంఘాల నియామకం

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ అబ్దుల్ హాలి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రిజ్వాన్, ఆదిలాబాద్ పట్టణ దళిత కాంగ్రెస్ చైర్మన్‌గా కాక్డే నాందేవ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆదివారం శాంతినగర్‌లోని సీఆర్ఆర్ నివాసంలో వారికి నియామక పత్రాలు అందజేశారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు దక్కుతుందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

జిల్లాలో 5.5 మి.మీ. వర్షపాతం

కైలాస్‌నగర్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం జిల్లా వ్యాప్తంగా మోస్తారు వర్షం కురిసింది. 5.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఉట్నూర్‌లో 10.1 మి.మీ, అత్యల్పంగా ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్, మావల మండలాల్లో 2.2 మి.మీ.లుగా నమోదైంది. ఇంద్రవెల్లిలో 9.9 మి.మీ, బోథ్‌లో 9.2మి.మీ, నేరడిగొండలో 8మి.మీ, సిరికొండలో 7.2మి.మీ, గుడిహత్నూర్‌లో 5.9మి.మీ, నార్నూర్‌లో 6.5మి.మీ, ఇచ్చోడలో 6.3మి.మీ, గాదిగూడలో 6.2మి.మీ, బజార్‌హత్నూర్‌లో 5.4 మి.మీ, బేలలో 4మి.మీ, తలమడుగులో 3.9 మి.మీ, భీంపూర్‌లో 3.6మి.మీ, జైనథ్‌లో 3.1 మి.మీ, తాంసిలో 2.6మి.మీ చొప్పున వర్షం కురిసింది. పూత, కాత దశలో ఉన్న పంటలకు ఈ వర్షం మేలు చేసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో వైష్ణవి ప్రతిభ



స్వర్ణ పతకం సాధించిన వైష్ణవి

ఆదిలాబాద్: మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో నిర్వహిస్తున్న 67వ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన కుస్తీ క్రీడాకారిణి వైష్ణవి గోల్డ్ మెడల్ సాధించింది. అండర్–14 బాలికల రెజ్లింగ్ పోటీల్లో ఫ్రీ స్టయిల్ విభాగంలో 56 కేజీల కేటగిరీలో స్వర్ణ పతకం సాధించినట్లు కోచ్ నాందేవ్ తెలిపారు. జిల్లాకు పతకం రావడంపై డీఈవో ప్రణీత, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారధి, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు హర్షం వ్యక్తం చేశారు.

న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వినతి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో ఉర్దూ మీడియంలోని 38 పోస్టులను నాన్ ముస్లింలకు కేటాయించారని, దీన్ని సవరించాలని ఉర్దూ డీఎస్సీ అభ్యర్థులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే రామన్నను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై డీఈవో కార్యాలయంలో డీఈవో ప్రణీత ద్వారా ఎమ్మెల్యే వివరాలు సేకరించారు. 2008 నుంచి 38 పోస్టులు ఖాళీగానే చూపిస్తున్నారని, ఈ డీఎస్సీలో కేవలం మూడు అదనంగా కేటాయించారని అభ్యర్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పోస్టులు రిజర్వ్ కారణంగా 38 ఎస్జీటీ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర వారికి కేటాయించారని తెలిపారు. 2008 నుంచి సమస్య ఉన్నా విద్యాశాఖ తన దృష్టికి తీసుకోరాకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లేలా తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అభ్యర్థులు అధైర్యపడవద్దని, ముఖ్యమంత్రి అందరికీ న్యాయం చేస్తారన్నారు. ఇందులో మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజాని, ఫెరోజ్, అబ్రార్ అహ్మద్, అభ్యర్థులు తదితరులున్నారు.



రెవెన్యూలో.. అవినీతి చేపలు!

- ఏసీబీకి పట్టుబడిన ఇద్దరు అధికారులు
- పట్టాపాస్‌బుక్‌లో పేరు సవరణకు డబ్బులు డిమాండ్
- రూ.2లక్షలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన వైనం
- మావల తహసీల్దార్, ఆర్ఐ రిమాండ్‌కు తరలింపు

ఆదిలాబాద్‌రూరల్: రెవెన్యూ శాఖలో ఇద్దరు అవినీతి అధికారులు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. పట్టాపాస్‌బుక్‌లో పేరు సవరణ కోసం ఓ రైతును కొంత కాలంగా తిప్పుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ పని చేసేందుకు డబ్బులు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఒప్పందం కుదుర్చుకున్న డబ్బులను అధికారులకు ముట్టజెబుతున్న సమయంలో దాడి చేసి పట్టుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కారని తెలియడంతో జిల్లా కేంద్రానికి చెందిన పలువురు కార్యాలయానికి చేరుకున్నారు. ఏం జరుగుతుందోనని తెలుసుకునేందుకు గుమిగూడారు.

అసలేం జరిగిందంటే..

నిజామాబాద్‌కు చెందిన నిర్మల్కర్ సుధాకర్‌తో పాటు ఆయన కుటుంబీకులకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా మావల శివారు సర్వే నం.181లో 14 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని అగ్రిమెంట్ రిప్రజెంటర్ యతేంద్రనాథ్ యాదవ్ తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వివరాలు.. సుధాకర్‌కు సంబంధించిన భూమిలో ఒక్కొక్కరి పేరిట మూడున్నర ఎకరాలకు సంబంధించి పట్టాలు ఉన్నాయి. ఈ పట్టేదారైన సుధాకర్ వృద్ధుడు కావడంతో దీనికి సంబంధించిన వ్యవహారాలు చూసుకునేందుకు తనకు అప్పగించాడు. అయితే పట్టాపాస్‌బుక్‌లలో పేర్లకు సంబంధించి మార్పుల కోసం 2023 ఏప్రిల్ 13న మావల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి తహసీల్దార్ కూడా ఈ పనుల విషయంలో జాప్యం చేశారు. ఆ తహసీల్దార్ బదిలీపై వెళ్లే సమయంలో కలెక్టర్ కార్యాలయానికి ఫైల్ పంపించారు. కలెక్టరేట్ నుంచి ఆగస్టు 11న మావల తహసీల్దార్ కార్యాలయానికి రీవెరిఫికేషన్ కోసం ఫైల్ వచ్చింది. ఈ ఫైల్ కదలకుండా అలాగే ఉంది. దీంతో ఈ విషయంపై తహసీల్దార్‌ను కలిసి పనులు పూర్తి చేయాలని విన్నవించగా స్పందించలేదు. మధ్యవర్తిగా ఆర్ఐ హన్మంత్‌రావు రూ.20లక్షలు డిమాండ్ చేశాడు. తమవద్ద అంత మొత్తంలో డబ్బులు లేవని తెలుపడంతో మొదట రూ.2లక్షలు ఇవ్వాలని డీల్ చేశాడు. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కొన్ని డబ్బులు చెల్లించాలని పేర్కొన్నాడు. దీంతో వారు ఒప్పుకున్నారు. మావల తహసీల్దార్ ఆరిఫా సుల్తానా, ఆర్ఐలు డబ్బులు డిమాండ్ చేశారు. ఆదివారం మావల తహసీల్దార్ కార్యాలయానికి డబ్బులు తీసుకురావాలని తెలిపారు. దీంతో ఆదిలాబాద్‌లోని ఏసీబీ అధికారులను యతేంద్రనాథ్ యాదవ్ ఈనెల 21న ఆశ్రయించాడు. ఒప్పందం మేరకు యతేంద్రనాథ్ ఆయన సోదరుడితో కలిసి ఆదివారం ఉదయం 11.15 గంటల ప్రాంతంలో డబ్బులు తీసుకొని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నాడు. డబ్బులను రెవెన్యూ అధికారులకు ముట్టజెబుతుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి మొబైల్ ఫోన్లను సైతం స్వాధీనం చేసుకున్నారు.

ఏడు నెలల వ్యవధిలో రెండో ఘటన..

జిల్లాలో అవినీతి అధికారులు ఇటీవల తెరపైకి వస్తున్నారు. ఆయా పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. కొంత మంది తమ పనుల కోసం డబ్బులు ముట్టజెబుతుండగా గత్యంతరం లేక మరికొంత మంది ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులతో పాటు రిమ్స్‌లో పనిచేసే మరో జూనియర్ అసిస్టెంట్ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఇద్దరు రెవెన్యూ అధికారులు ఏసీబీకి పట్టుబడడంతో అవినీతి అధికారుల్లో గుబులు మొదలైంది.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

అవినీతి అధికారుల రిమాండ్..

పట్టుబడిన తహసీల్దార్, ఆర్ఐలను కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టుకు రిమాండ్ కోసం తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. సాయంత్రం వరకు ఇద్దరు అధికారులను విచారించినట్లు తెలిపారు. తహసీల్దార్ ఆరిఫా సుల్తానా, ఆర్ఐ హన్మంత్‌రావు పనులు చేసేందుకు డబ్బులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చుతామన్నారు. పనుల కోసం అధికారులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీని ఆశ్రయించాలని పేర్కొన్నారు.


డిజిటల్ క్రాప్ సర్వే

- పైలట్ ప్రాజెక్ట్‌గా మావల మండలం ఎంపిక
- పంటల వివరాలు శాటిలైట్‌తో అనుసంధానం
- కచ్చితమైన వివరాల సేకరణ కోసం..
- త్వరలో జిల్లా అంతటా అమలు

ఆదిలాబాద్‌టౌన్: వ్యవసాయ శాఖలో ఇదివరకు పంటల వివరాలను మ్యానువల్‌గా చేపట్టేవారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులతో డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాల్లో ఈ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేపడుతుండగా పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలోని మావల మండలాన్ని ఎంపిక చేశారు. జిల్లాకు ఓ మండలాన్ని ఎంపిక చేయగా, వ్యవసాయ అధికారులు పంట క్షేత్రాలకు వెళ్లి వివరాలు డిజిటలైజేషన్ చేస్తున్నారు. శాటిలైట్‌తో అనుసంధానం చేసి లొకేషన్ షేర్ చేస్తున్నారు. కచ్చితమైన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చేలా చర్యలు చేపడుతున్నారు. ఒక్కసారి వివరాలు నమోదు చేస్తే భవిష్యత్తులో మ్యానువల్ రూపంలో కాకుండా ఆన్‌లైన్‌లో ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంటుంది. శాటిలైట్‌కు అనుసంధానం చేయడంతో ఏ మండలంలో ఏ పంటలు పండిస్తున్నారు, సాగు విస్తీర్ణం ఎంత, ప్రస్తుత పరిస్థితులేమిటనే విషయాలు ఎప్పటికప్పుడు తెలియనున్నాయి. త్వరలో జిల్లా అంతటా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

శాటిలైట్‌కు అనుసంధానం..

జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం 5లక్షల 74వేల 500 ఎకరాలు ఉండగా, వీటిలో అత్యధికంగా 4లక్షల 13వేల ఎకరాల్లో పత్తి పంట, 90వేల ఎకరాల్లో సోయాబీన్ , 60వేల ఎకరాల్లో కంది పంట, 3800 ఎకరాల్లో మొక్కజొన్న, 1850 ఎకరాల్లో జొన్న, 1192 ఎకరాల్లో వరి పంటలు సాగవుతున్నాయి. అయితే ఈ పంటల సాగు విస్తీర్ణాన్ని వ్యవసాయ అధికారులు ఏటా అంచనా వేస్తున్నారు. వీటిలో 20 నుంచి 30 శాతం వరకు హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. కాగా కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే పేరిట కచ్చితమైన వివరాలు సేకరించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన మండలాల ఏవోలు, ఏఈవోలకు హైదరాబాద్‌లో దీనిపై శిక్షణ కల్పించారు. క్షేత్రస్థాయికి వెళ్లి ఆండ్రైడ్ మొబైల్‌లో పంట చేను సర్వే నంబర్, రైతు పేరు, పంట పొలం సాగు విస్తీర్ణం, ఏయే పంటలు సాగు చేస్తున్నారు, అంతర పంటలు వేశారా, ఒకే పంట సాగు చేస్తున్నారా, సీడ్ ప్రొడక్షన్, వర్షాధార, బోరుబావి కింద పంటలు సాగు చేస్తున్నారా, పంటను ఏ నెలలో వేశారు, ఏ దశలో ఉందనే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఫొటోలను తీసి అప్‌లోడ్ చేస్తారు. సర్వే నంబర్‌తో పాటు లొకేషన్‌ను శాటిలైట్‌కు అనుసంధానం చేస్తారు. ఈ ఫొటోలన్నీ అనుసంధానం కావడంతో ఏ పంటలు సాగవుతున్నాయనే వివరాలు కచ్చితంగా తెలిసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఖరీఫ్ పంటల వివరాలను నమోదు చేస్తుండగా, ఆ తర్వాత రబీ పంటల వివరాలను సైతం డిజిటలైజేషన్ చేయనున్నారు. ఒక్కసారి వివరాలను నమోదు చేస్తే ఆ తర్వాత శాటిలైట్ ద్వారా పంటల సాగు వివరాలను తెలుసుకునే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు.



ఆన్‌లైన్‌లో నమోదైన పంటల వివరాలు

ప్రయోజనాలు..

క్రాప్ వివరాలను డిజిటలైజేషన్ చేయడం ద్వారా ప్రభుత్వానికి సాగు వివరాలు తెలిసిపోవడానికి దోహద పడుతుంది. అవసరమైన ఆహార ధాన్యాలు సాగవుతున్నాయా.. లేదా, ఇతర దేశాల నుంచి ఎగుమతి, దిగుమతులు చేసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ విస్తీర్ణంలో ఏయే పంటలు సాగు చేస్తున్నారు, దీనికి సంబంధించి ఎరువులు, విత్తనాలు ఎంత అవసరం ఉంటాయి, పంట కొనుగోలు సమయంలో ఎంత దిగుబడి వస్తుందనే విషయాలను కూడా తెలుసుకోవచ్చు. ఆయా మండలాలు, గ్రామాల పరిధిలో ఎన్ని ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి, సాగు చేయని భూమి ఎంత అనే వివరాలు తెలుసుకునే వీలుంటుంది. అయితే ఏటా వ్యవసాయ అధికారులు క్రాప్ సర్వే చేస్తున్నప్పటికీ కచ్చితమైన వివరాలు తెలియడం లేదు. వారి అంచనా ప్రకారం వివరాలను తెలియజేస్తున్నారు. డిజిటలైజేషన్ ద్వారా ఇకపై కచ్చితమైన సమాచారం అందనుంది.

డిజిటల్ సర్వే చేపడుతున్నాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిజిటల్ క్రాప్ సర్వే చేపడుతున్నాం. మావల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఏవో, ఏఈవోలు క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలు సేకరించి శాటిలైట్‌కు అనుసంధానం చేస్తున్నారు. దీని ద్వారా కచ్చితమైన పంట సాగు వివరాలు తెలుసుకోవచ్చు. ఇదివరకు మ్యానువల్ పద్ధతిలో ఈ ప్రక్రియ చేపట్టడం జరిగింది. వచ్చేనెల చివరి నాటికి సర్వే పూర్తవుతుంది. భవిష్యత్తులో జిల్లా అంతటా కూడా డిజిటలైజేషన్ ద్వారా క్రాప్ వివరాలు సేకరించే అవకాశం ఉంటుంది.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

బోథ్ డివిజన్ చేయాల్సిందే..



రహదారిపై బైఠాయించిన ఆయా గ్రామాల ప్రజలు

- రోడ్డెక్కిన మండలవాసులు
- పొచ్చర క్రాస్ వద్ద గంట పాటు రాస్తారోకో

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా ప్రకటించాలని చేస్తున్న ఉద్యమం తీవ్రరూపం దాలుస్తోంది. ఆందోళనలో భాగంగా ఈనెల 23న బోథ్ బంద్ చేపట్టగా, ఆదివారం మండలంలోని పొచ్చర క్రాస్ రోడ్డు వద్ద మండలంలోని 33 గ్రామ పంచాయతీల ప్రజలు రాస్తారోకో నిర్వహించారు. బోథ్‌ను డివిజన్ చేయాల్సిందే అంటూ నినదించారు. గంటపాటు రోడ్డుపై బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. కిన్వట్‌కు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి, బోథ్ నుంచి ఎక్స్‌రోడ్డు వెళ్లే రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఏళ్లుగా బోథ్‌ను డివిజన్ చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో కూడా ధర్నా నిర్వహిస్తామన్నారు. బోథ్ డివిజన్‌గా ప్రకటించకుంటే రానున్న ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. కాగా ధర్నాలో పాల్గొన్న వారిని పోలీసులు ప్రత్యేక వాహనాల్లో స్థానిక స్టేషన్‌కు తరలించారు.

71వ రోజుకు దీక్ష

బోథ్ డివిజన్ సాధన కోసం మండల కేంద్రంలో చేపట్టిన దీక్ష 71వ రోజుకు చేరింది. ఆదివారం నాటి దీక్షలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1990–91 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు కూర్చున్నారు. ఇందులో పోతన్న, రవీందర్, సంతోష్, సత్యనారాయణ, బృహస్పతి, హబీబ్, సలీం, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి అండగా..

- జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఎన్నో అవకాశాలు
- రూ.20లక్షల నుంచి రూ.కోటి వరకు సబ్సిడీ రుణాలు
- ఒకే దరఖాస్తుతో అన్ని రకాల అనుమతులు
- సద్వినియోగం చేసుకుంటే యువతకు ఎంతో మేలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్ రాజు



పరిశ్రమలశాఖ జీఎం పద్మభూషణ్ రాజు

కైలాస్‌నగర్: పరిశ్రమల స్థాపనకు జిల్లాలో అనేక అవకాశాలున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, ఫార్మా ఇండస్ట్రీస్, ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం, ఆటోమొబైల్, వాహనాల కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద రూ.20లక్షల నుంచి రూ.కోటి వరకు సబ్సిడీ రుణాలు అందజేస్తున్నాయి. ఆహార ఉత్పత్తి రంగ పరిశ్రమల స్థాపనకు కేంద్రం అత్యంత ప్రాధాన్యత నిస్తూ రుణాలను మంజూరు చేస్తోంది. యువత ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందడుగు వేస్తే స్వయం సమృద్ధితో పాటు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ పద్మ భూషణ్‌రాజు సూచిస్తున్నారు. ఆసక్తి గల యువత యూనిట్ల స్థాపనకు ముందుకు వస్తే వారికి అన్ని విధాలా సహకారం అందిస్తామని చెబుతున్నారు. యువత ఉపాధికి ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, పరిశ్రమలశాఖ అందించే రుణాలు, సబ్సిడీ మంజూరు వంటి అంశాలను ఇలా వివరించారు.

సాక్షి: జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధికి ఎలాంటి భరోసా కల్పిస్తున్నారు.?

జీఎం: పరిశ్రమల శాఖ ద్వారా తయారీరంగం, సేవా రంగానికి సంబంధించి బ్యాంకు లింకేజీతో కూడిన సబ్సిడీ రుణాలు అందజేస్తున్నాం. కేంద్రం ఉత్పత్తిరంగ పరిశ్రమలకు చేయూతనిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం సేవా రంగానికి ప్రాధాన్యతనిస్తూ సబ్సిడీని మంజూరు చేస్తోంది. యువత స్వయం ఉపాధి పొందేందుకు ముందుకు రావాలి.

సాక్షి: పరిశ్రమలు నెలకొల్పాలనుకునే వారు ఎవరిని సంప్రదించాలి,ఎలా దరఖాస్తుచేసుకోవాలి.

జీఎం: ఆసక్తి గల యువత పరిశ్రమల శాఖ కార్యాలయాన్ని సంప్రదిస్తే డాక్యుమెంట్స్ అప్‌లోడ్, హ్యాండ్ హోల్డింగ్ సర్వీస్‌ను అందిస్తాం. ఏ పరిశ్రమ లాభదాయకం.. ఎంత సబ్సిడీ ఉంటుంది.. ఆదాయం వంటి అంశాలపై వారికి అవగాహన కల్పిస్తాం. పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకునే వారు ఆన్‌లైన్‌లో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో ఓ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. ఆధార్, పాన్, బ్యాంక్ అకౌంట్, ఫోన్‌నంబర్, మెయిల్ ఐడీతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సాక్షి: పరిశ్రమల ఏర్పాటుకు ఎన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు అవసరమవుతాయి, వాటిని ఏ విధంగా తీసుకోవాలి?

జీఎం: ఎలాంటి పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకున్నా నాలా, విద్యుత్, డీటీసీపీవో, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వంటి సర్టిఫికెట్లను పొందాల్సి ఉంటుంది. వీటి కోసం వేర్వేరుగా కాకుండా టీఎస్ ఐపాస్ కామన్ అప్లికేషన్ పోర్టల్‌లో డెబిట్‌కార్డు ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆయా శాఖలు నెల రోజుల్లోపు సంబంధిత సర్టిఫికెట్లు జారీ చేస్తారు. జాప్యం చేస్తే ఆయా శాఖ అధికారి వేతనంలో నుంచి రూ.1000 చొప్పున జరిమానా విధిస్తారు.

సాక్షి: ఎలాంటి పరిశ్రమలకు రుణాలు ఇస్తారు, సబ్సిడీ ఎంత మంజూరవుతుంది..?

జీఎం: టీ ఐడియా స్కీం కింద బీసీ, ఓసీ, మైనార్టీలకు పురుషులకు 15శాతం సబ్సిడీతో రూ.20లక్షలు, మహిళలకు 25శాతం సబ్సిడీతో రూ.30లక్షల వరకు రుణాలిస్తారు. తయారీ రంగానికి మాత్రమే వీటిని మంజూరు చేస్తారు. టీప్రైడ్ ద్వారా ఎస్సీ, ఎస్టీ పురుషులకు 35శాతం సబ్సిడీ, మహిళలకు 40శాతం సబ్సిడీతో రూ.75లక్షల వరకు రుణాలిస్తారు. వీటితో ట్రాక్టర్లు, కార్లు, జేసీబీలు, బస్సు, లారీలు వంటి వాటిని కొనుగోలు చేయవచ్చు. వీటికి రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీ అందజేస్తోంది.

సాక్షి: యువత ఇంకా ఎలాంటి రుణాలు పొందవచ్చు, వాటికి సబ్సిడీ ఎంత మంజూరు చేస్తారు.?

జీఎం: కేంద్ర ప్రభుత్వం పీఎంఈజీపీ ద్వారా తయారీ రంగానికి రూ.50లక్షలు, సేవా రంగానికి రూ.20లక్షల వరకు రుణాలను అందజేస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని ఓసీ పురుషులకు 15శాతం, గ్రామీణ ప్రాంతాల వారికి 25 శాతం సబ్సిడీ చెల్లిస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గ్రామీణ ప్రాంతాల వారికి 35శాతం, పట్టణ ప్రాంతాల వారికి 25శాతం సబ్సిడీ చెల్లిస్తుంది. వీటిద్వారా బ్యూటీపార్లర్, టైలరింగ్, జిరాక్స్, సెంట్రింగ్, కేబుల్ నెట్‌వర్క్‌తో పాటు యువత ఆసక్తిగల రంగాన్ని ఎంచుకుని రుణం పొందవచ్చు.

సాక్షి: ఆహారఉత్పత్తి రంగ పరిశ్రమలకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు. వాటి రుణం, సబ్సిడీ ఎంత?

జీఎం: పీఎంఎఫ్ఎంఈ స్కీం ద్వారా ప్రభుత్వం ఆహార ఉత్పత్తి రంగ పరిశ్రమలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ రూ.కోటి వరకు రుణాలు అందజేస్తోంది. అన్ని కులాల వారికి 35శాతం సబ్సిడీతో వీటిని మంజూరు చేస్తోంది.

సాక్షి: సబ్సిడీ విడుదలతో జాప్యం అవుతున్నట్లు ఆరోపణలున్నాయి. కారణమేంటి. జిల్లాలో ఎంత సబ్సిడీ పెండింగ్‌లో ఉంది.

జీఎం: కోవిడ్ వరకు ఎలాంటి యూనిట్‌కైనా సబ్సిడీ వెంటనే విడుదలయ్యేది. కరోనా తర్వాత సబ్సిడీ విడుదలలో జాప్యం అవుతున్న మాట వాస్తవమే. జిల్లాలో మూడేళ్లకు సంబంధించిన సబ్సిడీ రూ.10 కోట్లు ప్రభుత్వాల నుంచి విడుదల కావాల్సి ఉంది. అయితే ప్రభుత్వాలు సబ్సిడీ విడుదల పరిమితిని పెంచినందున దాంతో ఇబ్బందులు లేవు. కేంద్ర స్కీంల కింద తీసుకున్న యూనిట్లకు మూడేళ్ల వరకు, రాష్ట్ర స్కీంల రుణాలకు ఆరేళ్ల వరకు సబ్సిడీని విడుదల చేస్తామనే నిబంధన ఉన్నందున ఆ గడువులోపు అందే అవకాశముంటుంది.

26,27 తేదీల్లో ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉట్నూర్‌లోని కేబీకాంప్లెక్స్ ఆవరణలో అండర్–14 జిల్లాస్థాయి బాలుర హాకీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు ప్రకటనలో పేర్కొన్నారు. 2010 జనవరి 1 తర్వాత జన్మించిన వారు పోటీలకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10 గంటలకు కేబీ కాంప్లెక్స్‌లో రిపోర్ట్ చేయాలని సూచించారు. ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున బాలురు హాజరయ్యేలా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అలాగే మంగళవారం అండర్–14, 17 బాలుర జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలు సైతం నిర్వహించనునట్లు తెలిపారు. అర్హులైన క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో 10 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

27న ఖోఖో ఎంపిక పోటీలు..

ఈ నెల 27న ఉట్నూరులోని పూలాజి బాబా పాఠశాలలో వాలీబాల్ జిల్లాస్థాయి బాలికల ఖోఖో ఎంపిక పోటీలు ఉంటాయని, 2010 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10 గంటలకు పాఠశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్–17 బాలికల జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించనునట్లు తెలిపారు. అర్హులైన క్రీడాకారులు వయ సు ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10గంటలకు పోటీల ఆర్గనైజర్ రేణుకకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

క్లుప్తంగా

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తే అవకాశం

సోన్: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో పూర్తి స్థాయిలో నీరు చేరింది. దీంతో ఇప్పటికే అదనపు నీటిని వరద గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. మరో నెల పాటు ఈ పరిస్థితి కొనసాగే అవకాశమున్నందున నది పరీవాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. జాలరులు చేపల వేటకు వెళ్లకూడదని, పశువులు, గొర్రెల కాపరులు నదిలోకి దిగవద్దని సూచించారు.

ఘనంగా నిమజ్జనోత్సవం


ముధోల్‌లో నిమజ్జనోత్సవంలో సభ్యులు

ముధోల్: మండల కేంద్రంతో పాటు రాంటెక్, గన్నోరా, ఎడ్‌బిడ్ గ్రామాల్లో ఆదివారం గణనాథుల నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏడు రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనల్లో శోభాయాత్ర నిర్వహించారు. యువకుల నృత్యాలు, కోలాటాల మధ్య శోభాయాత్ర సంబరంగా సాగింది. ముధోల్‌లో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనోత్సవాన్ని ఏఎస్పీ కాంతిలాల్‌పటేల్ పర్యవేక్షించారు. సీఐ వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సందర్భంగా ఆయా మండపాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎద్దులు మృతి

బోథ్: సొనాల గ్రామానికి చెందిన గణేష్‌కు చెందిన ఎద్దులతో కూడిన ఎడ్లబండి శనివారం రాత్రి కోట(కె) గ్రామ శివారులోని ఒర్రెలో కొట్టుకుపోయింది. కొట్టుకుపోయిన ఎద్దులు ఆదివారం ఉదయం మృతిచెంది కనిపించాయి. దీంతో రైతు గణేష్ తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. రూ.1.50లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుడు దేవంత్ రమేష్ కథనం ప్రకారం.. రమేశ్ తండ్రి గంగన్న మృతి చెందడంతో శనివారం ఇంటికి తాళం వేసి నేరడిగొండ మండలం వడ్డూర్ గ్రామానికి వెళ్లారు. డబ్బులు అవసరం ఉండడంతో ఇంట్లో డబ్బులు ఉన్నాయని బావా సుమన్‌కుచెప్పాడు. ఆదివారం ఆయన కేఆర్కే కాలనీలోని ఇంటికి వెళ్లగా తాళం పగులగొట్టి కనిపించింది. దీంతో పోలీసులకు తెలిపారు. ఇంట్లో బీరువాలో ని రూ.12వేలు, ఐదు మాసాల బంగారం ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి

సోన్: ఓటరు నమోదు చైతన్య కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా స్థాయి పాటల రచన విభాగంలో మండలంలోని జాఫ్రపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బోడ హరిప్రియ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు తోడిశెట్టి పరమేశ్వర్ తెలిపారు. కలెక్టర్ ప్రశంసాపత్రం, రూ.5వేల నగదు అం అందజేశారు.

మధుర సంస్కృతి.. విభిన్నం

- వేష, భాషలో ప్రత్యేకత
- ఉత్తర భారతం నుంచి వలస వచ్చిన తెగ
- అకాడ, తీజ్, జోహారా ప్రత్యేక పండుగలు

బజార్‌హత్నూర్(బోథ్): చెమటచుక్క లెక్కచేయని శ్రామికులు.. అందం, అమాయకత్వం కలగలిసిన పశు ప్రేమికులు.. అడవిని జయించగల పూరేకులు.. భూమిని చుట్టేయగల ప్రకృతి ప్రేమికులు.. నాగరిక సమాజానికి కాస్త దగ్గరగా ఉన్న సంచార సమూహమే మధుర తెగ. ఇందులో 11 గోత్రాల వారున్నారు. వీరిలో ఉమ్మడి కుటుంబాలే అధికం. ఈ తెగకు పెద్ద నాయక్. తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో మాత్రమే ఈ తెగ కనబడుతుంది.


జోహారా కార్యక్రమంలో భాగంగా పుట్టమన్ను తెస్తున్న మహిళలు


ఆభరణాలు ధరించిన మధుర లబానా మహిళ


పాచికలు ఆడుతున్న మధుర లబానా పురుషులు

ఆచార సంప్రదాయాలు

ఈ సంచార తెగ ఒకప్పుడు ఉత్తర భారతం నుంచి వలస వచ్చిన సంచారజీవులు. ప్రస్తుతం అటవీప్రాంతాల సమీపంలో, కొండలు, వాగుల వద్ద స్థిరపడ్డారు. ప్రధానంగా పశు కాపరులు. వీరి ఆర్థికస్థితిని పశువుల సంఖ్యతోనే లెక్కగడుతారు. దశాబ్దాల క్రితం గోవులను మేపుకుంటూ నెలల తరబడి ఇంటికి దూరంగా వెళ్లేవారు. మొదట్లో పోడు వ్యవసాయం చేసేవారు. ప్రస్తుతం పశుసంపదతో పాటు వ్యవసాయం చేస్తున్నారు. ఆచార సంప్రదాయాల్లోనే కాదు వేషభాషల్లోనూ ఈ తెగ ప్రత్యేకమే. ఎంతో విశిష్టత సంతరించుకున్న మధుర తెగను కయితి లబానా, మధుర లబానా, మురికి లబానా అని పిలుస్తారు. 1708లో ఉత్తర భారతదేశంలోని పంజాబ్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి ఈ తెగ వలస వచ్చినట్లు ప్రతీతి.

పండుగలకు ప్రత్యేక స్థానం

మారెమ్మ, మావలి, అకాడి, నాగులపంచమి, జోహారా, రాఖీ, దసరా పండుగలు వారి జీవితాల్లో ప్రధానమైనవి. కృష్ణున్ని అమితంగా పూజిస్తారు. హోలీని మూడురోజుల పాటు జరుపుకుంటారు. దూల్, దూలండి, పాయిబీచ్..ఇలా రోజుకో కార్యక్రమం జరుగుతుంది.

ఆడపిల్లల ప్రత్యేక పండుగ జోహారా

పాముల పుట్ట (చీమల పుట్ట) నుంచి తెచ్చిన బంక మట్టిలో గోధుమ గింజలు, శనగ గింజలు పోయగా మొలకెత్తిన వాటినే జోహారా అంటారు. నాగుల పంచమి తర్వాత మూడు రోజులకు ఈ పండుగ ఉంటుంది. ఈ నారుకు పెళ్లికానివారు 8 రోజుల పాటు బావి నుంచి నీరు తెచ్చి పోస్తారు. ఇలా ఎనిమిదో రోజు రాత్రి పూట కన్నయ్య(బంక మట్టి ముద్ద)కు పూజిస్తారు.

మహిళలది ప్రత్యేక స్థానం

వీరి ప్రధాన వృత్తి పశుపోషణ. ఇందులో సింహభాగం పనులు మహిళలే చేస్తారు. వీరికి ఆభరణాలంటే అమితాసక్తి. ఊడిపోయిన తల వెంట్రుకలను పోగు చేసుకుని నిలువుగా కుట్టిన గుడ్డలో వాటిని ఉంచి చుండాను తయారు చేస్తారు. తలపై నుంచి చుండా పడిపోకుండా బ్యాలెన్స్ చేసే దోరాను కట్టుకుంటారు. నుదిటిపై టిక్కి, ముక్కుకు ఉండే నథోలి, మెడలో ఉండే ఆభరణంలో రాకిడి, నమోలి, కపోర్, పావుల, ఘాటి, చెవులకు ఘాటి, బీట్‌కేట్, చేతి గాజుల్లా కనిపించే ఘోట్, మెగర్, మోచేతులపైకి ఉండే అలియా, గజార, దోరా, కాళ్లకు చూడా, లాక్, ఛీడ్, నడుముకు కాచులి, గాగ్రా, కాలి వేళ్లకి బిచ్కా, చట్కి, గుట్టి వంటి ఆభరణాలు ధరిస్తారు. పెళ్లి కాని ఆడపిల్లలు లెహంగా, కచ్లీ దుస్తులు ధరిస్తారు. పురుషులకు ఆహార్యంలో పాగడి, పరికి, పలోపేటి, దండా దోక, దోనియా, జగ్ల, దోతి, కంగ్రి రుమాల్, పంచ ప్రధానంగా కనిపిస్తాయి.

సంప్రదాయక ఆహారం

గోధుమ రోటి, శనగ, పెసర, మొక్కజొన్నలకు సంబంధించిన ఆహారం, పాలు, పెరుగు, వెన్న, ఆవు నెయ్యి, టీ, బెల్లం, తీపి పదార్థాలు ఎక్కువగా తీసుకుంటారు. పండుగల సమయంలో మాల్‌పూవ, సిరా, గేహర్, పూరి, మలిద, లాప్సీ వంటి పిండి వంటకాలతో పాటు పల్లి, కందగడ్డలతో పాయసం చేసుకుంటారు. వంటలకు కట్టెల పొయ్యినే వాడుతారు. అప్పట్లో పొయ్యిలో నిప్పు ఉన్నప్పుడు అన్నం తినేవారు. ఒకవేళ నిప్పు ఆరిపోతే అన్నం తినేవారు కాదు. కొందరు ప్రభుత్వం ఇచ్చిన పక్కా ఇళ్లు కట్టుకున్నా మిగతా వారు ఇప్పటికీ గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారు. అడవుల్లోని కలప దుంగలతో ఇళ్లు కట్టుకుంటారు. పైకప్పుగా టీన్స్, వరిగడ్డిని వాడుతారు.


కన్నయ్యను పూజిస్తున్న యువతులు

తీజ్ కూడా ప్రత్యేకమే

బంజారాల మాదిరిగా మధుర లబానా తెగవారు తీజ్ ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటారు. రాఖీపౌర్ణమి తర్వాత మూడు రోజులకు వచ్చే తీజ్‌ను పెళ్లి కాని ఆడపిల్లలు జరుపుకుంటారు. 21 రకాల పూలు, బంకమట్టితో కన్నయ్యను తయారు చేసి దేవుడిలా అలంకరించి పూజిస్తారు. రాత్రి పూట నిమజ్జనం చేస్తారు.

నగారా (డోలు) వాయిద్యం

ఈ తెగ వారు ప్రతీ పండుగ, కార్యక్రమంలో ఉపయోగించే వాయిద్యం నగార. దున్నపోతు చర్మంతో చేసిన నగార వారి అన్ని కార్యక్రమాలలో కీలకమైంది. వీరి ప్రధాన ఆటవిడుపు కార్యక్రమం చోప్డా(పాచికలు). ఆయా పండుగల్లో మహిళలు నృత్యం చేస్తూ పాటలు పాడుతూ ఉంటే పెద్దలు ఒకచోట కూర్చుని పాచికలు ఆడుతూ సేదతీరుతారు.

పండుగలంటే అభిమానం



మా మధుర సమాజంలోని మహిళలకు ఆభరణాలు, పండుగలంటే ప్రత్యేక అభిమానం. అకాడ, జోహారా, తీజ్ పండుగలు నియమ నిష్ఠలతో చేస్తాం. నూతన వస్త్రాలు, ఆభరణాలు ధరించి పూజలు చేస్తాం. పెళ్ళికాని ఆడపిల్లలు జోహారా, తీజ్ పండగలను జరుపుకుంటారు. మహిళల ప్రత్యేక ఆకర్షణగా చుండా ఉండేది. కానీ ప్రస్తుతం యువతులు చుండాను ధరించడానికి ఇబ్బంది పడుతున్నారు.

– అజాడే జయశ్రీ, ఎంపీపీ, బజార్‌హత్నూర్

పశుపోషణే మా కులవృత్తి



మధుర లబాన కులస్తుల కులవృత్తి పశుసంపద. గతంలో నెలల తరబడి పశువులను మేపుకుంటూ గ్రాసం ఉన్న దూరప్రాంతాలకు వెళ్లే వాళ్లం. ప్రస్తుతం సాగునీటి సౌకర్యాలు ఏర్పడటంతో వ్యవసాయంతో పాటు పశువులు కాస్తున్నాం. మా కులంలో ఇప్పటికీ కట్నకానుకల సమస్య లేదు. ప్రతి మధురలాబాన కుటుంబం నాయక్ మాటను గౌరవిస్తారు.

– దరుసింగ్‌నాయక్, మంజరంతండా

ఎన్నికలు బహిష్కరిస్తాం

- ఏజెన్సీ నాన్‌ట్రైబల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భారత్ వాఘ్మారే


మాట్లాడుతున్న అధ్యక్షుడు భారత్ వాఘ్మారే

నార్నూర్: ఏజెన్సీ గిరిజనేతరుల సమస్యలను పరిష్కరించి ప్రత్యేక హక్కులు కల్పించకుంటే రానున్న ఎన్నికలను బహిష్కరిస్తామని ఏజెన్సీ నాన్ ట్రైబల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భారత్ వాఘ్మారే అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఏజెన్సీ గిరిజనేతరుల అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఏజెన్సీ గిరిజనేతరులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50ఏళ్లకు పైగా గిరిజనులతో సమానంగా ఏజెన్సీ ప్రాంతంలో ఉంటున్న ఎస్సీలు, బీసీలు, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఏజెన్సీ చట్టాల అమలులో గిరిజనేతరులకు ఎటువంటి హక్కులు లేక దుర్భారమైన జీవితాలను గడుపుతున్నారన్నారు. ఏజెన్సీలో గిరిజనులకు కానీ గిరిజన చట్టాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా గిరిజనేతరులకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయన్నారు. గిరిజనేతరులు సాగు చేస్తున్న భూములకు పహాణీ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉంటున్న గిరిజనేతరులకు దళితబంధు, గృహలక్ష్మి, రైతుబంధు, రైతుభీమా వంటి పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జాడే నాగోరావు, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు యునుస్ అక్బానీ, ట్రెజరర్ జ్ఞానోబా పుస్కర్, మండలాధ్యక్షుడు కాంతారావు దుర్గే, నాయకులు బ్రిజ్‌లాల్ కార్మాన్కర్, దస్తగీర్, దుర్గే మహేందర్ ఉన్నారు.

ఆదిలాబాద్ నుంచి కళాత్మక లఘుచిత్రాలు


జిల్లా కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కళాకారులు కళాత్మకంగా లఘు చిత్రాలను చిత్రీకరిస్తున్నారని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ చైర్మన్ మామిడి హరికృష్ణ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాదులోని రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న ఫిల్మ్ తెలంగాణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో సినీవారం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు చెందిన పలువురు యువ లఘు దర్శకులు తీసిన లఘు చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఆదివారం జిల్లా కేంద్రానికి చెందిన కిరణ్ తీసిన గరీబ్, సుమంత్ ప్రొడక్షన్, మెస్రం రవి, రాగాల వీణ అనే జిల్లాకు చెందిన యూట్యూబ్ చానళ్లకు చెందిన లఘు చిత్రాలను ప్రదర్శించారు. హరికృష్ణ మాట్లాడుతూ యువ కళాకారులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కళాకారులు చిత్రీకరించిన చిత్రాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. వారికి గొప్ప భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమానికి హాజరైన జిల్లాకు చెందిన సినీ నిర్మాత డాక్టర్ రవికిరణ్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభకు కొదవలేదని, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా లఘుచిత్ర దర్శకులను అభినందించారు. కార్యక్రమంలో రమేష్, కిషన్ గౌడ్, రత్నాకర్ ఉన్నారు.


సామాజిక న్యాయం కోసం పోరాటం

- మాలిమహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత భాస్కర్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు


ఆదిలాబాద్‌రూరల్: మాలీలకు సామాజిక న్యాయం లభించే వరకు పోరాటం చేస్తామని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పులే విశ్రాంతి భవనంలో సత్యశోధక సమాజ స్థాపన 150వ దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర నుంచి వచ్చిన అతిథులతో కలిసి మాట్లాడారు. బహుజన కులాలన్నీ పూలే అడుగుజాడల్లో నడుస్తూ సామాజిక న్యాయంతో పాటు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రధాన్ భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, రాష్ట్ర కోశాధికారి సతీష్ గురునులే, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు ఉమేష్ రావు డోలే, జిల్లా అధ్యక్షుడు విజయ్ వాడగురే యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ధనంజయ్ ప్రధాన్, ప్రధాన కార్యదర్శి ఉత్తమ్ వాడగురే, హిందీ డైలీ సీనియర్ ఎడిటర్ సందేశ్ భరద్వాజ్ సావతా పరిషత్ నాందేడ్ జిల్లా అధ్యక్షుడు తులసిరామ్ వాడ్గురే, కార్యవర్గ సభ్యులు అశోక్ పేటకులే, సంతోష్ పెట్కులే, మాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబేద్కర్ చంద్రశేఖర్, మహిళా కార్యకర్తలు శాలిని ప్రధాన్, కల్పన పెట్కులే, ఉజ్వల డోలే పాల్గొన్నారు.

డెంగీతో బాలుడు మృతి


అఫ్జల్ పాషా(ఫైల్)

ఖానాపూర్: డెంగీతో బాలుడు మృతి చెందిన ఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. సుభాష్‌నగర్ కాలనీలోని 12వ వార్డు కౌన్సెలర్ ఫాజీయ బెగం, షబీర్ పాషా దంపతుల కుమారుడు అఫ్జల్ పాషా(8) కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. రక్తకణాలు తగ్గిపోవటంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. బాలుడి కుటుంబ సభ్యులను పలువురు నాయకులు పరామర్శించారు.

గుండెపోటుతో కండక్టర్ మృతి


పోశలింగం (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: ఆర్టీసీ కండక్టర్ విధుల్లో గుండెపోటుతో మృతిచెందిన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. జాడి పోశలింగం(54) ఆర్టీసీ కండక్టర్‌గా ఆదిలాబాద్ డిపోలో పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం విధుల్లోకి వెళ్లి ఆకస్మాతుగా కింద పడిపోయాడు. వెంటనే సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోశలింగం మృతితో ఆర్టీసీ ఉద్యోగులు కలత చెందారు. మృతుడికి భార్య గీత, ముగ్గురు సంతానం ఉన్నారు.

'దాడులు చేస్తే ఊరుకోం'


ఖానాపూర్: నియోజకవర్గంలోని పలు మండలాల్లో దళిత గిరిజనుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ వ్యవరిస్తున్నాడని బీజేపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రచకొండ సాగర్, మండల అధ్యక్షుడు టేకు ప్రకాష్ అన్నారు. మండంలోని రాజూరా గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ భర్త రవీందర్‌పై పోలీసులతో దాడులు చేయించి అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఆర్‌ఎండీబీ విశ్రాంతి భవనం ఆవరణలో నోటికి నల్లగుడ్డలతో నిరసన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌పై తప్పుడు ప్రచారం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకలు మ్యాకల వెంకటేష్, ఇనుముల స్వామి, మనోహర్, పెద్ది రమేష్, రాజేశ్వర్ ఉన్నారు

నిమజ్జనం.. కావాలి నిర్విఘ్నం


గుజిరిగల్లి మార్గంలో శిథిలావస్థకు చేరిన భవనం

- శోభాయాత్ర మార్గంలో దారులపై గుంతలు
- పలుచోట్ల తక్కువ ఎత్తులో సర్వీస్‌వైర్లు
- ఏర్పాట్లు చేస్తున్నామంటున్న మున్సిపల్ అధికారులు
- జాగ్రత్తలు పాటించాలని సూచన

భైంసాటౌన్: భైంసా పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఇప్పటికే పట్టణంలోని ప్రాంతాల్లో శోభాయాత్ర మార్గాన్ని పలుమార్లు పరిశీలించారు. శోభాయాత్ర మార్గంలో రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు, శిథిలావస్థలకు చేరిన, వంగిన స్తంభాలు సరిచేయాలని సూచించారు. మిషన్ భగీరథ పనులతో ఏర్పడిన రోడ్లపై ఏర్పడిన గుంతలు సకాలంలో పూడ్చివేయించాలన్నారు. ఈ మేరకు మున్సిపల్, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శోభాయాత్ర మార్గంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రెండ్రోజుల్లో నవరాత్రోత్సవాలు పూర్తి కాగానే నిమజ్జనోత్సవం జరుగనుంది. కాగా, శోభాయాత్ర మార్గంలో కొన్నిచోట్ల రోడ్లపై గుంతలు పూడ్చాల్సి ఉంది. అలాగే కొన్నిచోట్ల నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా, కొన్నిచోట్ల ఇళ్ల కనెక్షన్లకు సంబంధించి ఇచ్చిన సర్వీస్ వైర్లు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో విగ్రహాలు తరలించే క్రమంలో ఇబ్బందుల తలెత్తే అవకాశముంది. సంబంధిత అధికారులు సకాలంలో ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.


గుజిరిగల్లిలో తక్కువ ఎత్తులో సర్వీస్ వైర్లు

ఏర్పాట్లు చేస్తున్నాం

గణేశ్ నిమజ్జనోత్సవాలకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. శోభాయాత్ర మార్గంలో రోడ్లపై గుంతలను పూడ్చివేయిస్తాం. తక్కువ ఎత్తులో ఉన్న, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను సరిచేయించాం. సమస్యాత్మక ప్రాంతాల్లో బారికేడింగ్ ఏర్పాటు చేయిస్తాం. శోభాయాత్ర మార్గంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా మూడు జనరేటర్లను అందుబాటులో ఉంచుతాం. నిమజ్జన ఘాట్ వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతాం.

– వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, భైంసా


పురానాబజార్‌లో..